


విజయనగరం రైల్వే స్టేషన్ ఆవరణలోనే ఇలా విశ్రాంతి తీసుకుంటున్న ప్రయాణికులు

- రైల్వే ప్రయాణికులపై నిర్లక్ష్యం ● కానరాని విశ్రాంత గదులు, మరుగుదొడ్లు
- ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు తినుబండారాల విక్రయాలు
- నత్తనడకన ఫ్లై ఓవర్ పనులు ● ఇదీ విజయనగరం రైల్వే స్టేషన్‌లో పరిస్థితి

సమస్యల స్టేషన్లు


బొబ్బిలి: ట్రాక్ దాటుతున్న ప్రయాణికులు



విజయనగరం రైల్వేస్టేషన్

విజయనగరం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే విజయనగరం రైల్వేస్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు, విశ్రాంత గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. తినుబండారాలు కొనాలన్నా అమ్మో అనాల్సిందే. స్టేషన్ ఆవరణలోని దుకాణదారులు ఇష్టారీతిలో ఎమ్మార్పీని మించి ధర చెబుతున్నారు. బయటకు వెళ్లలేక వారు చెప్పిన ధరకే కొనుగోలు చేస్తున్నారు. అధిక ధరలను నియంత్రించేందుకు అధికారులు ప్రయత్నించడం లేదు. విజయనగరం స్టేషన్ మీదుగా ప్రతిరోజూ దాదాపు 92 రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిద్వారా సుమారు 19వేల మంది ప్రయాణికులు జిల్లా కేంద్రం నుంచి ఆయా ప్రదేశాలకు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం రైళ్లను ఆశ్రయిస్తున్నారు. వీరికి కనీస సదుపాయాలు అందజేయడం లేదు. ఫిర్యాదు (మిగతా 6వ పేజీలో..)

బొబ్బిలిలో..

బొబ్బిలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో అనేక సమస్యలు తిష్ఠ వేశాయి. ప్లాట్‌ఫామ్ చివరన దిగే ప్రయాణికులు ఎత్తైన ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి బయటకు రావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లిఫ్ట్ లేకపోవడంతో వృద్ధులు, రోగులు, పిల్లలు, లగేజీలతో ఉన్న ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. రైల్వేస్టేషన్‌లో వాహన పార్కింగ్ ధరలు అధికంగా ఉన్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. నూతనంగా మూడో రైల్వేలైనును ఇటీవల ప్రారంభించారు. కొత్తగా స్టేషన్‌భవనాన్ని నిర్మించారు. కానీ ప్రయాణికులకు వసతులు పూర్తిస్థాయి లో సమకూర్చలేదు. తాగునీటి కుళాయిలు చాలా అధ్వానంగా ఉన్నాయి. నాలుగు పొడుగాటి ప్లాట్‌ఫామ్‌లు, విశ్రాంతి భవనాలు, ఇతర ట్రాక్‌లను శుభ్రం చేయడానికి ఇద్దరే శానిటేషన్ వర్కర్లు (మిగతా 6వ పేజీలో..)


విజయనగరం టౌన్: ఫ్లైఓవర్ పనులు ఇలా..

- కర్ణభేరి పగిలేలా శబ్దాలు
- గుండెపోటు, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి సమస్యలు
- కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్న వైనం
- శ్రీకాకుళంలో భవనం పోర్టుకో కూలి ఏడుగురికి తీవ్ర గాయాలు
- ఆ శబ్దాలు అనర్థమంటున్న వైద్యులు

డేంజర్ డీజే



విజయనగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వివాహాలు, పండుగలతోపాటు ఏ శుభకార్యమైనా చాలు.. డీజే శబ్దాల మోత మోగుతోంది. పరిమితికి మించిన అతి ధ్వనులతో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. శబ్దాల మోత తట్టుకోలేక కొంతమంది గుండెపోటుతో మరణించిన సంఘటనలూ ఉన్నాయి. ఊరేగింపుల సమయంలో డ్యాన్సులు చేస్తూ కొందరు యువకులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ పలుచోట్ల చోటుచేసుకున్నాయి. తాజాగా బుధవారం అర్ధరాత్రి పొరుగు జిల్లా శ్రీకాకుళంలో నరసన్నపేట పట్టణం భవానీపురంలో నందెన్న ఉత్సవాల్లో భాగంగా డీజే ఏర్పాటు చేయగా.. ఆ శబ్దాలకు శిథిలావస్థలోఉన్న ఓభవనం పోర్టుకో కూలిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో డీజే ఎంత డేంజరో మరోసారి రుజువైంది. ఇటువంటి ఘటనలు తరచూ జరుగుతున్నా డీజేల ఏర్పాటుపై కొంతమంది యువకులు వెనక్కి తగ్గకపోవడం గమనార్హం. ముఖ్యంగా పండుగలు, పెళ్లిళ్ల వేళ అర్ధరాత్రి వరకూ డీజేల మోత మోగుతుంటుంది. దీనివల్ల స్థానికుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. కర్ణకఠోరంగా మారిన శబ్దాల కారణంగా పలువురు గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్నారు. విజయనగరం మండలం బొబ్బాదిపేటలో ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా డీజే ఏర్పాటు చేశారు. దీనిముందు హరీష్ (22) అనే యువకుడు నృత్యం చేస్తూ అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు. ఈ యువకుడు ఆ మరునాడే పోటీ పరీక్షల శిక్షణ నిమిత్తం హైదరాబాద్ వెళ్లాల్సి ఉంది. హఠాత్తుగా చనిపోవడంతో ఆ కుటుంబం మొత్తం విచారంలో మునిగిపోయింది. రాజాం మునిసిపాలిటీ పొనుగొటివలసకు చెందిన ఓ యువకుడు కూడా వినాయక నిమజ్జనోత్సవంలో డీజే ముందు డాన్స్ చేస్తూ మృతి చెందాడు.

75 డెసిబెల్స్ కంటే ఎక్కువ..

ధ్వని తరంగాలు 70నుంచి 85 డెసిబెల్స్ వరకు ఉంటే ఎలాంటి (మిగతా 6వ పేజీలో..)


శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో డీజే సౌండ్‌కి కూలిన భవనం పోర్టుకో

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



డీజేల వంటి భారీ శబ్దాలతో వినికిడి సమస్యలు తలెత్తడమే కాకుండా గుండె, ఊపిరితిత్తులపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. నిరంతరంగా 85 డెసిబెల్స్ శబ్దాలు వింటే శరీరంలో కార్టిసాల్ అడ్రినలిన్ వంటి ఒత్తిడి హార్మోనులు విడుదలవుతాయి. ఇవి రక్తనాళాలపై ఒత్తిడి పెంచి గుండె కొట్టుకునే వేగాన్ని, రక్తపోటును పెంచుతుంది. శబ్ద తీవ్రత 85 డెసిబుల్స్ మించితే, ఒక్కసారి గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీసే అవకాశం ఉంది. 100/120 డెసిబుల్స్ శబ్దం నేరుగా కర్ణ భేరీని దెబ్బతీస్తుంది. నిరంతరం ఈ శబ్దాలకు లోనైతే, టినీటస్ (చెవుల్లో హోరు) సమస్య మొదలై, క్రమంగా చెవుడు వస్తుంది. శబ్ద తీవ్రత 50 డెసిబుల్స్‌కు మించకూడదు.

-డాక్టర్ జీబీ వెంకట్, ఈఎన్‌టీ సర్జన్, విజయనగరం

భూసేకరణ వేగవంతం చేయాలి

- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు అవసరమయ్యే భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తోటపల్లి, నారాయణపురం, తారక రామ తీర్థసాగర్, మడ్డువలస, తాటిపూడి, ఆండ్రా ప్రాజెక్టులపై నీటి పారుదల అధికారులతో గురువారం సమీక్షించారు. జిల్లాలో రూ.50 కోట్లు నిధులు ఉన్నాయని, సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణకు అవసరమయ్యే నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిక అందించాలని ఆదేశించారు. తోటపల్లి ప్రాజెక్టులో గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌కి సంబంధించి భూసేకరణ సత్వరం పూర్తి చేయాలన్నారు. నీటి పారుదల ప్రాజెక్టులకు అనుబంధంగా 759 ఎంఐ ట్యాంకులు ఉన్నాయని, జిల్లాలో ఆర్ఆర్‌లో భాగంగా చెరువులు పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద 40 చెక్ డ్యామ్‌ల పనులు 8.6 కోట్ల అంచనా వ్యయంతో జరుతున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ స్వర్ణకుమార్, ఎస్ఈలు అప్పారావు, సుధాకర్, ఈఈలు అప్పలనాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్లపై
కఠినంగా వ్యవహరించాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



విజయనగరం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం పోలీసు అధికారులతో ఆయన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలకు అనుగుణంగా అధికారులు, సిబ్బంది వృత్తి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని స్మార్ట్ పోలీసింగ్ చేయాలని సూచించారు. నేరస్థులపై, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు లేకుండా విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రార్థనా మందిరాలు, ముఖ్య కూడళ్లు, విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తాత్కాలిక అనుమతులు కలిగిన (మిగతా 6వ పేజీలో..)

కొత్తవలస-విజయనగరం నాల్గో రైల్వే లైన్‌కు
ప్రధాని మోదీ శంకుస్థాపన

కొత్తవలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ, సూర్ సేవింగ్స్ కార్యక్రమం కోసం గురువారం కర్నూలు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటిలో ఉత్తరాంధ్రకు సంబంధించి పలు కార్యక్రమాలు ఉన్నాయి. కొత్తవలస నుంచి విజయనగరం వరకు చేపట్టనున్న నాలుగో రైల్వే లైన్ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.493 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ రైల్వే లైన్ ఏర్పాటు చేయడం వలన రైళ్ల ఆలస్యాన్ని నియంత్రించడమే కాకుండా మరిన్ని వందే భారత్ రైళ్లను నడిపేందుకు, సరుకుల రవాణాకు ఎంతో ఉపయోగపడనుంది. అలాగే రూ.184కోట్లతో పెందుర్తి నుంచి సింహాచలం నార్త్ మధ్య చేపట్టనున్న రైల్వే ఫ్లైఓవర్ లైన్‌కు, రూ.964తో నిర్మించనున్న సబ్బవరం నుంచి విశాఖపట్నం, గాజువాక, షీలానగర్ వరకు జాతీయ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తవలస నుంచి ఒడిశాలోని కోరాపుట్ వరకు రూ.546 కోట్లతో పూర్తి చేసిన రైల్వే డబ్లింగ్ పనులు, శ్రీకాకుళం -ఒడిశాలోని అంగూల్ వరకు రూ.1730 కోట్లతో ఏర్పాటు చేసిన నాచురల్ గ్యాస్‌పైప్ లైన్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

రూపాయితో భవన నిర్మాణాలకు అనుమతి

- రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చామంతి

బొబ్బిలి అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యాభై చదరపు మీటర్ల లోపు స్థలాల్లో చేపట్టనున్న భవన నిర్మాణాల కోసం కేవలం రూపాయి ఫీజుతో అనుమతి పొందవచ్చునని టౌన్‌ప్లానింగ్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చామంతి అన్నారు. స్థానిక మునిసిపల్ కౌన్సిల్ హాలులో గురువారం టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయాల ఉద్యోగులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జీవో నెంబరు 3 ద్వారా లేఅవుట్ అమెండ్‌మెంట్ రూల్స్, జీవో 4 ద్వారా బిల్డింగ్ రూల్స్, జీవో 20 ద్వారా సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీము అమలులో ఉందన్నారు. రూపాయి ఫీజు వెసులుబాటుపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ గడువు ఈ నెల 23తో ముగుస్తున్నందున అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయాల పరిధిలో పెద్దఎత్తున ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. 229 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను అప్రూవ్ చేయడంతో రూ.3.46 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్‌లో 7 శాతం ఫీజు చెల్లించి అనధికార ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో టీపీఏ భార్గవి, డీటీసీపీవో నాగలత, టీపీఎస్ ఫిలిప్, సచివాలయాలటౌన్ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టౌన్‌ప్లానింగ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ చామంతి

పనులు ఇవే..

మొక్కలు నాటడం, ఫీడర్ ఛానెల్స్ బాగుచేయడం, ఫీల్డ్ బండ్‌లు, భూమి అభివృద్ధి, కమ్యూనిటీ వాటర్ హార్ వెస్టింగ్ పాండ్లు, రీచార్జి షిట్లు, పర్కులేషన్ ట్యాంకుల నిర్మాణం, వర్షపునీటి సంరక్షణ పనులు, ట్రెంచ్‌లు, చెక్‌డ్యాములు, సాగునీటి బావుల నిర్మాణం, పంటకాలువలు, చెరువుల్లో పూడికతీత, కందకాల తవ్వకాలు, పండ్ల తోటల పెంపకం, తుపాను షెల్టర్లు, ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రణాళిక పూర్తికాగానే ఉపాధి కొత్త పనులు ప్రారంభం కానున్నాయి.



'ఉపాధి'కి ప్రణాళిక!

- కొత్త పనులు గుర్తించేందుకే
- బడ్జెట్ అంచనాలపైనా నివేదిక
- గ్రామాల్లో చురుగ్గా గ్రామసభలు
- ఈసారి నాలుగు కేటగిరీల్లో 192 రకాల పనులకు అవకాశం

రాజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామాల్లో గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైంది. భారీ వర్షాల తర్వాత సాగునీటి వనరుల్లో నీరు నిల్వ ఉండడంతో ఈ పనులకు అవకాశం లేదు. అందుకే ఇతర ప్రజోపయోగ పనులను గుర్తిస్తున్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నాలుగు కేటగిరీల కింద 192 రకాల పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో గ్రామసభలు పూర్తయ్యాయి. నవంబరు 18న పంచాయతీలు ఉపాధి పనుల బడ్జెట్‌కు ఆమోదం తెలపాలి. అదే నెల 30న మండల పరిషత్, డిసెంబరు 15న జిల్లా పరి షత్ ఈ బడ్జెట్‌ను ఆమోదిస్తాయి. డిసెంబరు 31లోగా ఈ ప్రక్రియ పూర్తికావాలి. ఉపాధి ప్రణాళికను 'యుక్తధార' పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఒక వేతనదారుడికి రోజుకు రూ.307 వేతనం, రూ.204.66 మెటీరియల్ కాంపోనెంట్ కలిపి రూ.511.66 ఇచ్చే విధంగా అంచనా బడ్జెట్‌ను రూపొందిస్తారు.

జిల్లాలో 777పంచాయతీలుండగా 3,85,508 జాబ్‌కార్డులు ఉన్నాయి. 6,87,403 మంది వేతనదారులు పనిచేస్తున్నారు. అయితే యాక్టివ్‌లో ఉన్న జాబ్‌కార్డులు 3,46,260కాగా.. క్రియాశీలకంగా పనులకు (మిగతా 6వ పేజీలో..)

ప్రజోపయోగ పనులకు పెద్దపీట

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో వేతనదారులుకు పూర్తిస్థాయిలో పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజోపయోగ పనులకే పెద్దపీట వేస్తాం. నాలు గు కేటగిరిల కింద 192 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది.

- శారదాదేవి, డ్వామా పీడీ, విజయనగరం

ట్రామాకేర్ ఏర్పాటు ఎప్పుడో?



- ప్రతిపాదనలకే పరిమితం
- పట్టించుకోని గత వైసీపీ సర్కార్
- రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి తక్షణం అందని వైద్యం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- నేడు వరల్డ్ ట్రామా డే

విజయనగరం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల మీదుగా 16వ నెంబరు జాతీయ రహదారి 32 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అలాగే రాజాపులోవ నుంచి సాలూరు మీదుగా ఒడిశా-రాయపూర్ 26 నెంబరు జాతీయ రహ దారి 90 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. అంతరాష్ట్ర రహదారుల సైతం ఉన్నాయి, ప్రతి 50 నుంచి 70 కిలోమీటర్ల మధ్య ట్రామాకేర్ తప్పనిసరిగా ఉండాలి. కానీ జిల్లాలో ఒక్క ట్రామా కేర్ సెంటర్ లేదు. దీంతో రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి సకాలంలో చికిత్స అందడం లేదు. వారిని విజయనగరం, విశాఖ పట్నంలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించేలోపు ప్రాణాలు కోల్పోతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం

జాతీయ రహదారుల వెంట ట్రామా కేర్ సెంటర్లు అందుబాటులో ఉంటే ప్రమాదాలకు గురైన వారి ప్రాణాలను కాపాడవచ్చు. ఈ సెంటర్ల ఏర్పాటుపై గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వాహనచోదకులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలి. హెల్మెట్ ధరించక చాలా మంది ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు. జాతీయ రహదారుల కనెక్టవిటీ రోడ్ల వద్ద స్పీడు బ్రేకర్లు, డ్రమ్స్, బారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చాం. జిల్లాలో ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- ఏఆర్ దామోదర్, ఎస్పీ, విజయనగరం



ప్రతిపాదనలతో సరి..

హైవేలపై ప్రమాదాలకు గురైన వారికి తక్షణ వైద్యం అందించాలన్న లక్ష్యంతో ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో తెరపైకి వచ్చింది. భోగాపురం మండలం సుందరపేట సీహెచ్‌సీని ట్రామా కేర్ సెంటర్‌గా మార్చాలని అప్పట్లో నిర్ణయించారు. ఆ వైపుగా అడుగులు పడుతున్న దశలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం జరిగిపోయింది. వైసీపీ ప్రభు త్వం ట్రామా కేర్ల విషయాన్ని పూర్తిగా పట్టిం చుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉం డడంతో మళ్లీ కదలిక రావచ్చునని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. రామభద్రపురం, చీపురుప ల్లి, విజయనగరం, సాలూరు, పార్వతీపురం ఆసుపత్రుల్లో ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ కేంద్రాల్లో ఇద్దరు చొప్పున జనరల్ సర్జన్లు, ఆర్థోపెడిక్ సర్జన్లు, మత్తు వైద్యులు అందుబాటులో ఉండడం వల్ల క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అంది ప్రాణాపాయం తప్పే వీలుంటుంది.

ప్రమాదాలు ఇలా..

16వ జాతీయ రహదారిపై ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 45 ప్రమాదాలు జరగ్గా, 20 మంది మృత్యువాత పడ్డారు. 15మందికి తీవ్ర, 30 మందికి స్వల్ప గాయాలయ్యాయి. 26వ జాతీయ రహదారిపై 63 ప్రమాదాలు జరగ్గా, 23 మంది మృతిచెందారు. 30 మందికి తీవ్రంగా, 45 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

నమో..జోష్



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్











'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సభలో ఉప్పొంగిన దేశభక్తి



సభలో టీడీపీ మహిళా నేతలు







శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



పొలాల వెంబడి పరుగులు

నకిలీ మద్యానికి చెక్



- సురక్ష యాప్‌ను తీసుకొచ్చిన ప్రభుత్వం
- బార్ కోడ్ స్కాన్‌తో మద్యం సీసా పూర్తి వివరాలు

గజపతినగరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరింత కఠిన చర్యలు చేపట్టింది. మద్యం దుకాణాలు, బార్‌లలో నాణ్యమైన మద్యం అమ్మకాలు జరిగేలా దృష్టి సారించింది. నకిలీ మద్యం నివారణకు ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఆ శాఖ అమల్లోకి తీసుకువచ్చింది. ఇకపై ప్రతి మద్యం సీసా మూతపై ఉన్న క్యూర్ కోడ్‌ను స్కాన్ చేశాకే దుకాణం, బార్ యజమానులు అమ్మాలని నిబంధనలు విధించింది. దీంతో మద్యం సీసాపై ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేస్తే చాలు. దాని హీల్‌టడ్ బ్రాండ్ పేరు, సీసా పరిమాణం, బ్యాచ్, ఐడీ, ఎమ్మార్పీ, తయారు చేసిన సంస్థ పేరు, తయారీ తేదీ, ఏ డిపో నుంచి రవాణా అయింది.. ఏ దుకాణంలో అమ్మాలి.. తదితర సమగ్ర వివరాలు క్షణాల్లో వస్తాయి. వినియోదారుడు ఆ సమాచారాన్ని సీసాపై ముద్రించి ఉన్న వివరాలతో సరిపోల్చుకుంటే చాలు. అది అసలైన మద్యమా.. నకిలీదా అని సులువుగా గుర్తించవచ్చు. ఈ యాప్‌లో బార్ కోడ్ స్కాన్ చేసినప్పుడు ఎర్రర్ అని, ఇన్ వాలిడ్ బార్ కోడ్ అని వస్తే అది నకిలీదని అనుమానించవచ్చు. అనుమానం కలిగితే 14405 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుదారుడి పేరు, వివరాలు, ఫోన్ నెంబర్ అన్ని గోప్యంగా ఉంచి విచారణ చేపడతారు. దుకాణాల్లో మద్యం అమ్మేవారు, కొనేవారు కూడా మద్యం నకిలీదో అసలైనదో తెలుసుకోవచ్చు. ప్రతి మద్యం దుకాణంలో సీసా అమ్మేముందు ఈ యాప్‌లో స్కాన్ చేస్తే ఆ సీసాకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసిపోతుంది. దీనివల్ల బెల్టు దుకాణాల్లో అమ్మడానికి అవకాశం ఉండదు. అలాగే ఎక్సైజ్ సిబ్బంది ప్రతిరోజూ మద్యం దుకాణం, బార్‌లలో ర్యాండమ్ విధానంలో తనిఖీలు నిర్వహించనున్నారు. తనిఖీల వివరాలను దుకాణాల్లోని రిజిస్టర్‌లో నమోదు చేసి ఎక్సైజ్ అధికారి రోజూ సంతకాలు చేయాలి. డిపోల నుంచి మద్యం స్టాక్ అందిన తర్వాత ప్రతి దుకాణం, బార్‌లలో ప్రతి సరుకులోని కనీసం ఐదు శాతం బాటిల్స్‌ను స్కాన్ చేయాలి. బ్యాచ్ వెరిఫికేషన్ సర్టిఫికెట్‌పై లైసెన్స్‌దారు సంతకాలు తప్పనిసరి చేసింది. సర్టిఫికెట్‌ను డైలీ లిక్కర్ జెన్యూనెస్ వెరిఫికేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. తనిఖీల్లో నకిలీ మద్యాన్ని గుర్తిస్తే వెంటనే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలి. నకిలీ మద్యం పట్టుబడితే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు ప్రభుత్వం తీసుకోనుంది. నకిలీ మద్యంపై ప్రజలు ఫిర్యాదు చేసేందుకు 24 గంటలు పనిచేసే పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. కంట్రోల్ రూమ్, వాట్సాప్, హెల్ప్‌లైన్ ద్వారా 24 గంటల్లో విచారణ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం బ్రాందీ, విస్కీ మద్యానికి సంబంధించి మాత్రమే యాప్ అమల్లోకి వచ్చింది. ప్రస్తుతం బీర్ బాటిల్స్‌కు వర్తించదని అధికారులు అంటున్నారు. జిల్లాలో 169 మద్యం షాపులు, 20 బార్‌ల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రతి మద్యం బాటిల్ జియోట్యాగింగ్‌తో రావడంతో బాటిల్ అమ్మకాలపైనా తక్షణమే గుర్తించవచ్చు. దుకాణాల వద్ద మాత్రమే మద్యం అమ్మకం చేపట్టాలి. ఇతర ప్రాంతాల్లో అమ్మకాలు చేపడితే జియోట్యాగింగ్ ద్వారా ఏ మద్యం దుకాణం నుంచి సరఫరా అయ్యిందో అధికారులు గుర్తించవచ్చు. దీంతో బెల్టు షాపులను అరికట్టే వీలుంది. ఎక్కడా నకిలీ మద్యం అమ్మకాలకు తావులేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది.



మద్యంషాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

నకిలీ మద్యం అమ్మకానికి తావులేదు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడా నకిలీ మద్యం అమ్మకాలతో పాటు బెల్టు షాపుల నిర్వహణ చేయకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుంది. ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌తో మద్యం నాణ్యమైనదా.. నకిలీదా వినియోగదారులు తెలుసుకోవచ్చు. అలాగే ప్రతి సీసాపైనా జియోట్యాగింగ్ చేస్తారు. దీనివల్ల బెల్టుకు తరలించే అవకాశం ఉండదు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- డి.జనార్దనరావు, ఎక్సైజ్‌శాఖ సీఐ, గజపతినగరం



చిన్నారుల చేతిలో రూపుదిద్దుకున్న బొమ్మలు

చిట్టి చేతులతో మట్టి బొమ్మలు

- రావాడ అంగన్‌వాడీ కేంద్రంలో రూపకల్పన

భోగాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రావాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు చిట్టి చేతులతో మట్టి బొమ్మలు తయారు చేసి ఆశ్చర్యపరుస్తు న్నారు. ఇక్కడ ఒకే చోట రెండు అంగన్ వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఇందులో సుమారు 20 మంది వరకు చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ కార్యక ర్తలు అప్పలరాము, అంకమ్మ చిన్నారులకు మట్టితో వివిధ రకాల బొమ్మల తయారు చేయడం నేర్పుతు న్నారు. చిన్నారులు కూడా అంతే శ్రద్ధతో వాటిని తయారు చేయడాన్ని నేర్చుకుంటున్నారు. అంతేకాకుండా తెలుగు, ఇంగ్లీషు అక్షరాలు, నెంబర్లు తయారు చేసి.. పిల్లలకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు. చిన్నారుల సృజనకు పదును పెడుతున్న కార్యకర్తలను స్థానికులు, సంబంధిత అధికారులు అభినందిస్తున్నారు.



పిల్లలకు బొమ్మలు తయారు చేయడాన్ని నేర్పిస్తున్న కార్యకర్తలు

సర్పాల ప్రేమికుడు

- నాలుగు వేలకు పైగా పాములు పట్టిన రమణయ్య
- సురక్షితంగా అడవుల్లో విడిచిపెడుతున్న వైనం



రేగిడి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎవరైనా పాములు చూస్తే వణికిపోతారు. కొందరైతే పాము పేరు చెప్పగానే భయపడతారు. ఆయన మాత్రం పాములను ఇట్టే పట్టుకుంటాడు. వాటితో సావాసం చేస్తాడు. సర్పాలకు అపకారం జరగకూడదని భావిస్తాడు. మనుషులకు హాని కలగకుండా... పాములకు అపకారం చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటాడు. ఆయనే పోరాం గ్రామానికి చెందిన బట్టూరు రమణయ్య(45). చిన్న ప్రైవేటు సంస్థలో ఆపరేటర్‌గా పని చేస్తున్న రమణయ్య పాములను పట్టడంలో దిట్ట. ఇంతవరకు 4వేలకు పైగా పాములను పట్టి సురక్షిత ప్రాంతాల్లో విడిచిపెట్టాడు.

తాత అడుగుజాడల్లో..

రమణయ్య తాత నారాయణ స్వామి పాము కాటు వేస్తే తగ్గించే మంత్రగాడిగా ఈ ప్రాంతంలో సుపరిచితుడు. ఎవరికైనా పాము కరిస్తే పసరు వైద్యం చేసేవాడు. పాములకు హాని తలపెట్టకుండా ఆయన జాగ్రత్తలు తీసుకునేవాడు. దీనినే రమణయ్య అనుసరిస్తున్నాడు. ఒకవైపు ఊరిలోని శ్రీరామాలయంలో అర్చకుడిగా... మరోవైపు చిన్నపాటి కంపెనీలో ఆపరేటర్‌గా ఉపాధి పొందుతూనే.. పాములు పట్టడంపై దృష్టి పెట్టాడు. ప్లాస్టిక్ డబ్బాలు, ప్రత్యేక సాధనాల సాయంతో పాములను అలవోకగా పట్టేస్తాడు.

4,743 పాములు పట్టివేత..

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో ఎక్కడ పాముల సంచారం ఉన్నా... రమణయ్యకు కబురు అందగానే వాలిపోతాడు. ఇప్పటి వరకు నాగుపాములు, ఇతర విషసర్పాలు కలిపి 4,743 పట్టుకున్నానని చెబుతున్నాడు. వాటిని సురక్షితంగా అడవిలో విడచిపెడుతున్నట్లు రమణయ్య చెబుతున్నాడు. పాములు పట్టడం తనకు ఉపాధి కాదని తెలిపాడు. వాటిని చంపడం కూడా తనకు నచ్చదని అంటున్నాడు. ఎక్కడైనా పాములు పట్టాలంటే 93913 83989కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించాడు.





ముఖ్యమంత్రి హామీకి కార్యరూపం

- కిడ్నీ బాధిత కుటుంబానికి గృహం మంజూరు
- స్థలాన్ని పరిశీలించిన అధికారులు

దత్తిరాజేరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కిడ్నీ బాధిత కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చింది. ఈనెల 1వ తేదీన దత్తి గ్రామంలో పింఛన్ల పంపిణీలో భాగంగా ముఖ్యమంత్రి పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలోని కిడ్నీ బాధితుడు పొట్నూరు అప్పలరాజుకు పింఛన్ పంపిణీ అందజేశారు. ఆ సమయంలో వారి ఇంటిని పరిశీలించిన చంద్రబాబు బాధితుడి కోరిక మేరకు పక్కా ఇంటి నిర్మాణం చేపట్టి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు అక్కడ ఉన్న అధికారులను ఇంటి నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో గురువారం హౌసింగ్ జిల్లా పీడీ జి.మురళీ మోహన్, తహసీల్దార్ విజయభాస్కరరావుల తోపాటు టీడీపీ మాజీ మం డల అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు ఆధ్వర్యం లో రెవెన్యూ సిబ్బంది గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. మార్కింగ్ చేసి మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించారు. మూడు పడకల గది ఇంటి నిర్మాణం త్వరలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. దీంతో పొట్నూరు అప్పలరాజు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సీఎం చంద్రబాబుకు, మంత్రి శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఎం.సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ రాజేష్, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణానికి మార్కింగ్ చేస్తున్న అధికారులు

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుందని కలెక్టర్ రామసుందర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతిపత్రాలను అందజేసిన ఉద్యోగులు కూడా ఈ గ్రీవెన్స్‌కు హాజరై తమ అర్జీపై అధికారులు తీసుకున్న చర్యలను తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ గ్రీవెన్స్‌కు జిల్లా అధికారులంతా సకాలంలో హాజరు కావాలన్నారు.

పైడిమాంబ ఆలయాల ఆదాయం రూ.62.65లక్షలు

విజయనగరం కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ ఆలయాల హుండీలను గురువారం లెక్కించారు. వనంగుడి, చదురుగుడిల ఆదాయం రూ.62లక్షల 65వేల 227 వచ్చింది. దేవదాయ శాఖ కమిషనర్ శీరిషా ఆధ్వర్యంలో ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. బుధవారం చదురు గుడి ఆదాయం లెక్కించగా, రూ.50లక్షల 13వేల 221తో పాటు 35 గ్రాముల 300 మిల్లీ గ్రాముల బంగారం, 421 గ్రాముల వెండి వచ్చింది. గురువారం వనంగుడి హుండీ లెక్కించగా.. రూ.12లక్షల 52వేల 606 వచ్చింది.

నవదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.2.79 లక్షలు

రాజాం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవదుర్గ అమ్మవారి ఆలయానికి హుండీల ద్వారా రూ.2లక్షల 79వేల 269 ఆదాయం సమకూరింది. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త వానపల్లి నరిశింగరావు, పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈవో బీవీ మాధవరావు, దేవస్థానం ఈవో పొన్నాడ శ్యామలరావు, గురు భవానీ కూరాడ వెంకటరావు సమక్షంలో గురువారం హుండీలను తెరిచి లెక్కించారు. మొత్తం 36 రోజులకు గాను రూ.2లక్షల 79వేల 269 సమకూరినట్టు తెలిపారు.

బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు అంతా యాక్సిస్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించాలని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఖాతాలు తెరవడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని కార్మిక సంఘ నాయకులు గురువారం ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈసందర్భంగా ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఇబ్బందులు రానీయకుండా తాను చూసుకుంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

విద్యార్థులకు బహుమతులు

శృంగవరపుకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకల సందర్భంగా గత నెలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ఎస్.కోట మండల పరిధిలోని పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి గురువారం స్థానిక సత్యసాయి సమితి జోనల్ కోఆర్డినేటర్లు త్రిమూర్తులు, డా.ఆర్.త్రినాథరావు, సేవాదళ్ జిల్లా ఇన్‌చార్జి శ్రీరామూర్తి, బీవీఎస్ దాస్, గ్రంధి గాంధీ తదితరులు ఆయా కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి బహుమతులను అందించారు.

సోమరాజు కుటుంబాన్ని ఆదుకుంటాం

గంట్యాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రంపేట -వసంత గ్రామాల మధ్య గల గెడ్డలో వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు మృతి చెందడంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన సంతాపాన్ని ప్రకటించారు. ఈ ఘటన చాలా బాధకరమని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విదేశీ పర్యటనలో ఉన్న ఆయన.. మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి, జరిగిన ఘటనపై అడిగి తెలుసుకున్నారు. సోమరాజు కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అందాల్సిన సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.

అన్నదానానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న రఘు

పూసపాటిరేగ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పేరాపురం గ్రామానికి చెందిన శివశక్తి భ్రరాంబిక మల్లికార్జున పీఠానికి అన్నప్రసాదాల నిమిత్తం జనసేన పార్టీ మండల నాయకుడు కోట్ల రఘు రూ.20వేలు విరాళం అందజేశారు. గురువారం ఈ మొత్తాన్ని స్థానిక పీఠం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో పేరాపురం గ్రామ పెద్దలు కోరాడ మహేష్, పాడ్రంగి బంగారునాయుడు, వలిరెడ్డి తవుడు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

నెల్లిమర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 26న నిర్వహించన్ను భారత రాజ్యాంగ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ నాయకుడు బీవీ రమణ పిలుపునిచ్చారు. చంద్రంపేట పరిధిలో ఎల్ఎన్.పురంలోని దళితవాడలో ఆయన గురువారం పర్యటించారు. వచ్చే నెల 26న నెల్లిమర్లలో భారతరాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహిస్తున్నటు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మలాట రాము, దివకాల సంతోష్, సింహాద్రి, సూరిబాబు, గురుమూర్తి, అప్పారావు, శ్యామ్, సంతోష్ పాల్గొన్నారు.

కెల్ల గోదాంను ప్రారంభించేదెప్పుడో?



ప్రారంభానికి నోచుకోని కెల్ల సహకార సొసైటీ గోదాం

గుర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్ల సహకార సొసైటీ ఆధ్వర్యంలో బెల్లానపేట వద్ద రైతుల సౌకర్యార్థం నిర్మించిన గోదాం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ భవనం నిర్మించి సుమారు మూడు సంవత్సరాలు కావస్తోంది. ఈ గోదాంను ఎప్పుడు ప్రారంభిస్తారా.. అని రైతులు ఎదురుచూస్తున్నారు. దీనివల్ల కెల్ల, దమరసింగి, వల్లాపురం, ఎస్ఎస్ఆర్.పేట, మన్యపురిపేట, రాగోలు, తాటిపూడి తదితర ప్రాంతాల రైతులకు తాము పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని వారు తెలిపారు. ఇప్పటికైనా ఈ గోదాంను ప్రారంభించాలని రైతులంతా కోరుతున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 21 ప్రాంతాల్లో గురువారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకూ ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యవేక్షణలో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. నగరంలోని దాసన్నపేట జంక్షన్, ఎఫ్‌సీఐ గౌడౌన్, కొత్తపేట జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, జేఎన్‌టీయూ జంక్షన్ వంటి ప్రాంతాల్లో సీఐల ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. విజయనగరం డీఎస్పీ గోవిందరావు, భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు ఈ తనిఖీలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ నగరంలో నేరాలు నియంత్రించేందుకు గంజాయి, మద్యం, మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా అరికట్టేందుకు తనిఖీలు చేపట్టామని చెప్పారు. తనిఖీల్లో వాహన పత్రాలు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్పు చేసి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వాహనాలు సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వాహనదారులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ గోవిందరావు, భవ్యరెడ్డి, రాఘవులు, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్ వద్ద గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో జీఎస్టీపై నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుంచి ఆర్అండ్‌బీ జంక్షన్, సంతకాల వంతెన, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బాలాజీ జంక్షన్ వరకూ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 99 శాతం వస్తువులను 5 శాతం శ్లాబులోకి చేర్చడం వల్ల పన్నులు భారీగా తగ్గుతాయని చెప్పారు. ముడి సరుకుపై కూడా పన్నులు తగ్గడంతో ఆయా వస్తుల ధరలు కూడా గణనీయంగా తగ్గాయిని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ సేతు మాదవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించండి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సత్యనారాయణ

సంతకవిటి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి శ్రీకాకుళం జడ్పీ సీఈవో సత్యనారాయణ ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా స్వచ్ఛాంధ్ర లక్ష్యంపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులపై అడిగి తెలుసుకున్నారు. మండలంలోని 34 పంచాయతీల్లోని చెత్తను, ఆ గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జనన, మరణ వివరాలు నమోదు చేసుకోండి

కొత్తవలస, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో ఎవరు పుట్టినా, మరణించినా పంచాయతీ రికార్డులలో నమోదు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి గోపి సూచించారు. గురువారం కొత్తవలసలో సర్పంచ్ మచ్చ రామస్వామి ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు నమోదు చేసిన జననాలు, మరణాల వివరాలను సభ్యులకు వివరించారు. నిర్ణీత కాల వ్యవధిలో జనన మరణాలు నమోదు చేసుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని కార్యదర్శి సూచించారు. పంచాయతీకి వచ్చే ఆదాయ వనరులను సభ్యులకు వివరించారు. స్టాంపు డ్యూటీ రూపేణా సుమారు రూ.80లక్షలు పంచాయతీకి రావలసి ఉందన్నారు.

నేడు మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

విజయనగరం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మన్నార్ రాజగోపాలస్వామి ఆలయ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం అదే ఆలయ ఆవరణలో జరుగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరు కానున్నారు. పాలకవర్గం చైర్మన్‌గా మామిడి దేవేంద్ర నాథ్‌తో పాటు, తొమ్మిది మంది ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

పోలీసు శాఖకు డ్రోన్ అందజేత

విజయనగరం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు మా మహామాయ లిమిటెడ్ కంపెనీ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డ్రోన్‌ను వితరణ చేసింది. కంపెనీ ఎండీ అశోక్‌కుమార్ అగర్వాల్ గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఈ డ్రోన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ గోవిందరావు, ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, ఎస్‌బీ సీఐ లీలారావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలి

రాజాం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్ అన్నారు. మునిసిపాల్టీ పరిధి లోని ఏడో వార్డు అమ్మవారి కాలనీకి చెందిన రవ్వ అమ్మడమ్మ(85) గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. దీంతో ప్రశాంత్‌కుమార్, ప్రశాంత్‌కుమార్ సమాచారంలో విజయనగరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కల్యాణ్ నేత్రదాన సిబ్బంది వచ్చి, అమ్మడమ్మ నుంచి కార్నియాను సేకరించారు.

తల్లి పాలతోనే బిడ్డల ఎదుగుదల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తల్లి పాలతోనే బిడ్డల ఎదుగుదల సాధ్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని చెప్పారు. వైద్యుడు అనీల్‌కుమార్ మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈసందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పౌష్టికాహార కిట్లు అందజేశారు. ఎంపీడీవో ఎస్.అప్పారావు, ఐసీడీఎస్ పీవో భాగ్యలక్ష్మి, సర్పంచ్ కెర్రు పార్వతి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ● గజపతినగరం: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఐసీడీఎస్ పీవో రాజేశ్వరి అన్నారు. గురువారం స్థానిక ఎన్జీవో హోం కార్యాలయం లో పోషణ మహా ముగింపు కార్యక్రమం నిర్వహించా రు. ఈసందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోగల అంగన్‌వాడీలకు, గర్భిణులకు సీమంతాలు చేపట్టి పోషకాహారం తినడం వల్ల కలిగే లాభాలను వివరిం చారు. ఎంపీడీవో కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



చీపురుపల్లి: పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు

గుర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. గురువారం గుర్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద గరివిడి, గుర్ల మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో రాష్ట్రీయ పోషణ్ మహ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి, కిశోర బాలికలకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ పొట్నూరు ప్రమీల, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఆరుద్ర, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రామారావు, వైస్ చైర్మన్ దాసరి శివప్రసాద్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి వెన్నె సన్యాసినాయుడు, సొసైటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

● చీపురుపల్లి: మంచి ఆహారంతో ఆరోగ్యకరమైన కుటుంబం ఏర్పడుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. రాష్ట్రీయ పోషణ్ మహా ముగింపు కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అనంతరం వెల్ బేబీ పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. పౌష్టికాహార కిట్లను అందజేశారు. టీడీపీ నాయకులు రౌతు కాము నాయుడు, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, ముల్లు రమణ పాల్గొన్నారు.

భవిష్యత్తు తరాలకు సాంకేతికతను అందించాలి

మెరకముడిదాం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భవిష్యత్తు తరాలకు మేలైన సాంకేతికతను అందించే శాస్త్రవేత్తలుగా అభివృద్ధి చెందాలని ఎంఈవోలు చంద్రశేఖర్, ధర్మశ్రీలు ఆకాంక్షించారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో మండల స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో గర్భాం మోడల్ స్కూల్‌కు చెందిన ఎం.దుర్గాప్రసాద్ ప్రథమ బహుమతిని, బైరిపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎ.రుూకీషితాలు ద్వితీయ బహుమతి కైవశం చేసుకున్నారు. వీరు శుక్రవారం విజయనగరంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు. ఉపాధ్యాయులు, క్లస్టర్ టీచర్లు, విద్యార్థులు, సీఆర్పీలు, ఎంఆర్ఎస్‌లు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌లో విద్యార్థుల ప్రతిభ

చీపురుపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో గురువారం చీపురుపల్లిలో నిర్వహించిన సెమినార్‌లో పీకే పాలవలస జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మండలంలో ఉన్న 20 పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ సెమినర్‌లో భాగంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాలవలసకు చెందిన విద్యార్థులు జి.ఆదిత్య వర్ధన్, పి.తనిష్కులు ప్రథమ స్థానం పొందారు. వీరు గురువారం విజయనగరంలో జరగనున్న జిల్లా పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు బూసినాయుడు, ఎస్.విజయకుమార్, సీఆర్పీ కంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● నెల్లిమర్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సెమినార్‌లో జరజాపుపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.లాస్య ప్రథమ స్థానం సాధించింది. క్వాంటం యుగం ప్రారంభం-అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై ప్రసంగించి మొదటి బహుమతి సాధించింది. గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు శివకు బంగారయ్య గైడ్‌టీచర్‌గా వ్యవహరించారు. ఈసందర్భంగా లాస్యను హెచ్ఎం ఎస్.కామేశ్వరి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

రాజాం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పిలుపు మేరకు ఈనెల 17 నుంచి విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. విద్యుత్ కార్మికులు, ఉద్యోగులకు మద్దతుగా రాజాంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమ్మెకు కార్మిక సంఘాల ఐక్యవేదిక అండగా ఉంటుందని ఆయన ప్రకటించారు. ప్రభుత్వ తీరును నిరశిస్తూ ధర్నా చేశారు. సమానపనికి సమానవేతరం ఇవ్వాలని, నిరంతర వైద్యసేవలు అందివ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

సంతకవిటి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండవకురిటి గ్రామంలోని చాకలి వీధిలో బొమ్మరిల్లు రాజారావు అనే వ్యక్తికి చెందిన పూరిల్లు గురువారం అగ్నికి ఆహుతయ్యింది. విషయం తెలుసుకున్న పొందూరు అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షా 50వేలు నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల రిలే దీక్ష



రిలే దీక్షలో జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం కలిగిందని బొడ్డవరలో 118రోజులుగా నిరసన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు అన్నారు. గతంలో గ్రామసభ పెట్టి.. వినతులు తీసుకున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది తమ గ్రామాలకు వచ్చి, తమ భూ సమస్యలు అడగడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. గురువారం నిర్వహించిన రిలే దీక్షలో పలువురు జిందాల్ నిర్వాసితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● ఇద్దరికి గాయాలు

గుర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిగండ్రేడు తెట్టంగి గ్రామాల పొలాల మధ్య రోడ్డు ప్రమాదంలో పెనుబర్తి గ్రామానికి చెందిన అచ్యుతరావు(45) మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం దేవునికనిపాక గ్రామం నుంచి బైక్‌పై అచ్యుతరావుతోపాటు మరో ఇద్దరు తన స్వగ్రామం పెనుబర్తి వెళ్తుండగా.. అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న అచ్యుతరావు అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు గుసిడి నారాయణరావు, తాడేల కృష్ణలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంపై విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అచ్యుతరావు మృతదేహాన్ని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య పోలప్ప, ఇద్దరు పిల్లలు తరుణ్, వసంత్‌లు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం లభ్యం

నెల్లిమర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక చంపావతి నదిలో గల్లంతైన కనకల అప్పారావు(46) మృతదేహం గురువారం లభ్యమైంది. జరజాపుపేటకు చెందిన కనకల అప్పారావు బుధవారం థామస్‌పేట వద్ద చంపావతి నదిలో స్నానానికి దిగి, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో మునిగిపోయి గల్లంతయ్యాడు. ఎన్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా కొండపేట వెళ్లే రహదారి జ్యూట్ మిల్లు వద్ద మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి పంచనామా జరిపి, పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం.. నలుగురు మహిళల అరెస్టు



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

విజయనగరం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగురు మహిళలను పట్టుకుని, అరెస్టు చేశామని జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావుతో పాటు ఆర్పీఎఫ్ సిబ్బంది గురువారం తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మహారాష్ట్ర ఔరంగాబాద్‌కు చెందిన గీతా సంజయ్ చౌహన్, పారుభాయ్ సంజయ్ చౌహన్, రజనీ భీమాపవర్, వైశాలి కాలే అనే నలుగురు మహిళలు గంజాయితో పట్టుబడ్డారు. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి మహారాష్ట్రకు అక్రమంగా వీరు సుమారు రూ.4లక్షలు విలువైన 40కిలోల గంజాయిని తరలిస్తున్నారు. వీరిని పోలీసులు గుర్తించి, పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

మూగ యువతిపై వృద్ధుడి అత్యాచార యత్నం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో మూగ యువతిపై కిల్లి సన్యాసిరావు అనే వృద్ధుడు అత్యాచార యత్నం చేశాడు. బుధవారం సాయంత్రం ఆ వృద్ధుడు తన ఇంటి సమీపంలో ఒంటరిగా ఉన్న మూగ యువతిని బలవంతంగా నోరు మూసి, తన ఇంట్లోకి లాక్కెళ్లాడు. యువతి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు స్పందించారు. వెంటనే వృద్ధుడి నుంచి యువతిని రక్షించారు. వెంటనే బాధితురాలి తండ్రి మానవ హక్కుల సంఘ ప్రతినిధి కొత్తలి గౌరినాయుడుకు ఫిర్యాదుచేశారు. గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేస్తామని సీఐ నారాయణమూర్తి తెలిపారు.

కొట్లాటలో ఇరు వర్గాలపై కేసు నమోదు

సంతకవిటి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామంలో కొట్లాట ఘటనలో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ వి.రామకృష్ణ తెలిపారు. ఆయన గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుటుంబ కలహాల నేపథ్యంలో సిరిపురం గ్రామానికి చెందిన కర్రి గణపతిసూర్యప్రకాష్‌రావుపై తన తోడల్లుడు డోల తిరుపతిరావుతో పాటు తాడేల లచ్చయ్య, డోల సీతారాం, అక్కలపోతు నీలకంఠేశ్వరరావు, పొట్నూరు రామకృష్ణలు బుధవారం సాయంత్రం దాడి చేసి, గాయపరిచారు. దీంతో సూర్యప్రకాష్‌రావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం సూర్యప్రకాష్‌రావు శ్రీకాకుళంలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ● కొట్లాట సమయంలో డోల తిరుపతిరావును కర్రి గణపతిసూర్యప్రకాష్‌రావు, భార్య శాంతికుమారి, కుమారుడు అభిరామ్ ముగ్గురు తిడుతుండగా.. ఎందుకు తిడుతున్నారని డోల రామారావు అడిగారు. దీంతో వీరి ముగ్గురు కలిసి రామారావుపై రాళ్లతో దాడి చేసి, గాయపరిచారు. ఈ మేరకు రామారావు గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ ముగురిపై కేసు నమోదు చేశారు. రామారావు ప్రస్తుతం రాజాంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారిపై ఫిర్యాదు

రాజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తన స్థలంలో నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టేందుకు దరఖాస్తు చేసుకోగా, టౌన్ ప్లానింగ్ అధికారి రూ.50వేలు డిమాండ్ చేశారని రాజాం పట్టణంలో సీతారామ థియేటర్ లైన్ కాలనీకి చెందిన లక్ష్మీవెంకట శివప్రసాద్.. మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు గురువారం ఫిర్యాదుచేశారు. తన స్థలానికి సంబంధించి అన్ని సవ్యంగా ఉన్నప్పటికీ డబ్బులు డిమాండ్ చేశారని, టౌన్‌ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసు కోవాలని ఆయన కోరారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనని, తన సంతకం లేకుండా షాపింగ్ నిర్మాణదారుడికి నోటీసు ఇచ్చారని, దర్యాప్తు జరిపి నిజమని తేలితే ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ● దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి శాస్త్రి మాట్లాడుతూ మొదటి నోటీసు ఇవ్వడానికి కమిషనర్ సంతకం అవసరం లేదని, రెండో నోటీసుపై తప్పనిసరిగా సంతకం చేయించాలని చెప్పారు.

సదరం పరీక్షల వద్ద కానరాని సదుపాయాలు

రాజాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సదరం వైద్య నిర్ధారణ పరీక్షలు ప్రారంభమయ్యాయి. రాజాం ప్రాంతీయ ఆస్పత్రి వద్ద గురువారం నిర్వహించిన సదరం వైద్య నిర్ధారణ పరీక్షల వద్ద కనీస సదుపాయాలు లేని పరిస్థితి కనిపించింది. రాజాం ఆస్పత్రిలో కన్ను, ఆర్థోకు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. మొత్తం 1150 మందికి కేటాయించారు. బుధ, గురు, శుక్రవారాల్లో పరీక్షలు చేస్తున్నారు. గురువారం కంటి సమస్యతో బాధపడేవారు, వైకల్య సమస్యతో ఉన్నవారు హాజరయ్యారు. కానీ వారు కూర్చునేందుకు వీలుగా కుర్చీలు గానీ బెంచీలు గానీ ఏర్పాటుచేయలేదు. వైద్య పరీక్షలు చేసిన సమయంలో కూడా కిందే కూర్చోబెట్టడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయం విజయనగరం డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు దృష్టికి రావడంతో వెంటనే వెలుగు ఏపీఎంకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన ఆదేశాలతో వెలుగు అధికారులు అక్కడకు చేరుకున్నారు. కుర్చీలు, తాగునీరు సౌకర్యం కల్పించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

విజయనగరం బాబామెట్ట/ విజయనగరం టౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తామని ఏపీ గ్రంథాలయ పరిషత్ సభ్యులు ఆర్.రామమూర్తి నాయుడు అన్నారు. స్థానిక గురజాడ గ్రంథాలయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకుని విద్యార్థులు, ఉన్నత ఉద్యోగాలు సాధించాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బి.లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో మహిళా సంఘాలదే కీలక పాత్ర

గంట్యాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ అభివృద్ధిలో మహిళా సమాఖ్యలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌పాణి అన్నారు. స్థానిక మండల సమాఖ్యలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ పీఎంఈజీ వంటి పథకాలు సమర్థవంతంగా వినియోగించడం ద్వారా గ్రామీణ మహిళలు తమ జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవచ్చని చెప్పారు. ఏపీడీ సావిత్రి, జిల్లా ప్రాజెక్టు మేనేజరు చిరంజీవి, ఏపీఎం కె.సులోచనదేవి, మండల సమైఖ్య అధ్యక్షురాలు కర్రి అనసూయ పాల్గొన్నారు.

‘ఉపాధి’కి ప్రణాళిక!

(3వ పేజీ తరువాయి)

హాజరవుతున్న వేతనదారులు 5,71,511 మంది ఉన్నారు. ఈసారి వీలైనన్ని ఎక్కువ పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే గ్రామసభల్లో ప్రజలకు అవసరమైన సామాజిక పనులు గుర్తిస్తున్నారు.

పంచాయతీల్లో కమిటీలు..

గ్రామ పంచాయతీ స్థాయిలో పనులు గుర్తించేందుకు ఒక కమిటీని ఏర్పాటుచేశారు. బడ్జెట్ రూపకల్పనలో ఈ కమిటీ క్రియాశీలక పాత్ర పోషిస్తుంది. కమిటీలో సాంకేతిక సహాయకుడు/టీఏఫ్టీ, సచివాలయ సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, క్షేత్ర సహాయకుడు, పంచాయతీలో సీనియర్ మేట్, లైన్ డిపార్ట్‌మెంట్ల నుంచి సభ్యులుంటారు. ఈ బృందాన్ని ఏపీవో పర్యవేక్షిస్తారు. గ్రామసభల షెడ్యూల్ పీవో/ఎంపీడీవో నిర్ణయిస్తారు. వేతనదారులు, పంచాయతీ పరిధిలోని గ్రామలను అనుసరించి ఈ బడ్జెట్ ప్రణాళికను మూడు నాలుగు రోజుల్లో తయారుచేయాల్సి ఉంటుంది. ఈ సారి గోకులాలు, మ్యాజిక్ డ్రైన్లకు ప్రాధాన్యం ఇస్తారు.

డేంజర్ డీజే

(3వ పేజీ తరువాయి)

ఇబ్బందులు ఉండవు. మనిషి 75 డెసిబెల్స్ కంటే ఎక్కువ శబ్దం వినే పరిస్థితి ఉండదు. రద్దీ ప్రాంతాలు, ప్రశాంతంగా ఉండే ప్రాంతాల్లో 75 డెసిబెల్స్‌ని కూడా మనిషి వినలేడు. అయితే, డీజేల నిర్వాహకులు వాటి శబ్దాన్ని 90 నుంచి 120వరకు పెంచుతున్నారు. దీనివల్ల కర్ణభేరి పగిలేలా ధ్వనితరంగాలు వెలువడుతున్నాయి. ఈ సౌండ్‌తో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ గురై మృతి చెందుతున్నారు.

పాటించని నిబంధనలు

డీజేల ఏర్పాటు సమయంలో నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. పోలీసుశాఖ అనుమతి లేకుండానే వాటిని పెళ్లిళ్ల, ఉత్సావాల్లో పెడుతున్నారు. భరించలేని విధంగా, భారీ రణధ్వనులు వచ్చే విధంగా సౌండ్స్ సిస్టం అమర్చుతున్నారు. పాఠశాలలు, దేవాలయాలు, ఆసుపత్రులు తదితర వాటి ముందు డీజేలు నిషేధం. అటువంటి ప్రాంతాల్లో కూడా పెద్ద, పెద్ద సౌండ్స్ పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పోలీసు శాఖ చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుందనే విమర్శలు ఉన్నాయి.

గంజాయి స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరించాలి

(3వ పేజీ తరువాయి)

వ్యాపారులను మాత్రమే బాణసంచా విక్రయాలకు అనుమతించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అవాస్తవాలు పోస్టులు పెట్టే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. పోలీసుస్టేషన్ల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని.. ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఎన్‌డీపీఎస్, పోక్సో, అట్రాసిటీ, మిసింగ్, రోడ్డు ప్రమాదాల కేసులపై దర్యాప్తు పెండింగ్‌లో ఉన్న కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు గోవిందరావు, భవ్యరెడ్డి, రాఘవులు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల ‘స్టే’షన్లు

(3వ పేజీ తరువాయి)

చేసినా పట్టించుకోవడం లేదు. రైల్వేస్టేషన్‌లో మూడో నెంబర్ ప్లాట్‌ఫారంపై మినహా మిగతా నాలుగు ప్లాట్‌ఫారాలపై మరుగుదొడ్లు లేవు. స్టేషన్ ఆవరణలో వాటర్ బాటిల్ రూ.14కు అమ్మాల్సి ఉండగా రూ.20 తీసుకుంటున్నారు.

● పొరుగు జిల్లాలైన పార్వతీపురం, విశాఖపట్నం ప్రాంతాలకు చెందిన వారు వివిధ పనులపై రైల్వే స్టేషన్‌కు వచ్చినప్పుడు తమ వాహనాలను పార్కింగ్ స్టాండ్‌లో పెడుతున్నారు. ఇదే అవకాశంగా భావిస్తున్న నిర్వాహకుడు వాహనదారుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. అతనిపై చాలా మంది ప్రయాణికులు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ చర్యలు లేవు.

ముందుకుసాగని ఫ్లైఓవర్ నిర్మాణం

విజయనగరం రైల్వేస్టేషన్‌లో ఐదుప్లాట్‌ఫారాలు ఉండగా ఆయా రైళ్ల రాకపోకల సమయంలో వేరొక ప్లాట్‌ఫారానికి వెళ్లాల్సి వచ్చినప్పుడు ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. మరో ఫ్లైఓవర్ నిర్మించాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఒక్క వంతెన పెద్దగా ఉపయోగపడడం లేదు. అయితే అమృత భారత్ పథకం కింద ఫ్లైఓవర్ నిర్మాణమైతే చేపట్టారు కానీ ఎన్నాళ్లయినా పూర్తికావడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం


స్టేషన్ పరిధిలో ప్రయాణికులకు మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో లేకపోవడం వాస్తవమే. వాహనాల పార్కింగ్ నిర్వహణకు సంబంధించి టెండర్ గడువు ముగిసింది. ప్రయాణికుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఫ్లైఓవర్ నిర్మాణం జోరందుకుంది. స్టేషన్ ఆవరణలో ఉన్న సమస్యలను డీఆర్ఎం దృష్టికి తీసుకువెళ్లాం.

- ఎస్‌వీవీ రావు, స్టేషన్ మేనేజర్, విజయనగరం

బొబ్బిలిలో..

(3వ పేజీ తరువాయి)

ఉన్నారు. ఎస్ఎస్‌జీలో నాలుగో ర్యాంకు సాధించిన బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు అవసరమైన సిబ్బందిని నియమించాల్సి ఉంది.



నాచుపట్టిన తాగునీటి కుళాయిలో ఖాళీ మద్యం సీసా

మోడల్ రైల్వేస్టేషన్ ఎప్పుడో

బొబ్బిలి రైల్వే స్టేషన్‌ను మోడల్ స్టేషన్ చేస్తామంటే ఎంతో సంతోషించాం. దీనిపై పదిహేనేళ్ల నుంచి రాజకీయపార్టీల నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు కానీ ఆచరణ లేదు. చాలా ఎత్తులో కొత్త బ్రిడ్జి కట్టారు. దీనిపై వృద్ధులు, రోగులు, దివ్యాంగులు ఎలా వెళ్లగలరు. ఎక్సవేటర్, లిఫ్ట్ వంటివి లేవు. మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి. విజయనగరం వెళ్లడానికి టికెట్ చార్జీ రూ.30 అయితే వాహన పార్కింగ్ చార్జి రూ.50 వసూలు చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం?. **- శంకరరావు, ప్రయాణికుడు**

తాళ్లపేటలో 150 పశువులకు చికిత్స

పూసపాటిరేగ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాళ్లపేటలో గురువారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశు గర్భకోశ వ్యాధులకు చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. అవసరమైన చికిత్స నిర్వహించి, తగిన మందులు అందజేశారు. సుమారుగా 150 పశువులకు చికిత్స చేశారు. జేడీ కె.మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.దామోదరరావు, జిల్లా వైద్యాధికారి జగదీష్, పూసపాటిరేగ పశువైద్యాధికారి ఈశ్వర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అరటి రైతుకు కష్టం

● ఆశలపై నీళ్లు చల్లిన భారీవర్షాలు, ఈదురు గాలులు

● 65 ఎకరాల్లో పంట నష్టం



రంగరాయపురంలో గాలులకు నేలకొరిగిన అరటి చెట్లు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు, అధిక పెట్టుబడులు, కూలీల కొరత, సాగని ఎగుమతులు, దక్కని గిట్టుబాటు ధరలతో అరటి రైతు ఆవేదనకు గురవుతున్నాడు. ఈసారి వర్షాలు అరటి రైతును నిండా ముంచాయి. తొలి ఏడాది ఎకరానికి రూ.లక్ష, రెండో ఏడాదికి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. అయితే భారీ వర్షాలు, ఈదురు గాలులు ఆశలపై నీళ్లు చల్లిందని తలలు పట్టుకుంటున్నారు. బొబ్బిలి మండలంలోని పండించిన అరటి గెలలను రాయగడ, ఒడిశాలోని జయపూర్‌తో పాటు విజయ నగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. గతంలో 20 కిలోల గెల రూ.300 వరకు పలికేది. ప్రస్తుతం ఆ ధర సగానికి పడిపోయింది.

బొబ్బిలి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు అలజంగి, మెట్టవలస, కొత్తపెంట, పెంట, రంగరాయపురం తదితర గ్రామాల్లో సుమారు 65 ఎకరాల పరిధిలో అరటి తోటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. ఈ వర్షాలు నోటిఫైడ్ తుఫాన్ పరిధిలోకి రానందున రైతులకు నష్టపరిహారం ప్రశ్నార్థకంగా మారింది. నష్టాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అధికారులకు చేరలేదు. అధికారులు మాత్రం గ్రామాల్లో పంటల నష్టాన్ని పరిశీలించి, 33 శాతం గెలలతో పడిన చెట్లను పరిగణనలోకి తీసుకుని నివేదికలు తయారు చేస్తున్నారు.

● ఈ విషయంపై ఉద్యానశాఖ అధికారి ఎస్.వెంకటరత్నం వివరణ కోరగా.. ఇటీవల సంభవించిన తుఫాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలించి నివేదిక తయారు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. నష్టపరిహారం చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు.

మహవీర్ భూములపై ఆర్డీవో విచారణ



ఆర్డీవోకు వినతిపత్రాన్ని అందజేసున్న రైతులు

బాడంగి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మహవీర్ కంపెనీ భూములపై గురువారం డొంకినవలసలో ఆర్డీవో రామ్మోహనరావు విచారణ చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇటీవల 38మంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో కలెక్టర్ విచారణ చేపట్టాలని ఆర్డీవోను ఆదేశించారు. డొంకినవలసలో విచ్చేసిన ఆర్డీవో.. తొలుత అర్జీదారులతో మాట్లాడారు. 40 సంవత్సరాల కిందట మహవీర్ కంపెనీకు భూములు అమ్మేశామని, అప్పటి నుంచి ఆ భూములకు వారు స్వాధీనం చేసుకోకపోవడంతో సాగు చేసుకుంటున్నామన్నారు. ఈ భూములను తిరిగి తమకు అప్పగించాలని పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నామని రైతులు ఆర్డీవోకు వివరించారు. రైతులు చెప్పిన వివరాలను సిబ్బందితో రికార్డింగ్ చేయించి వారి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ తాను విచారణకు మాత్రమే వచ్చానన్నారు. భూములను దారాదత్తం చేసే తనకు అధికారం లేదన్నారు. ఇందుకు సంబంధించి ఏమైనా ఆధారాలు అందజేస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. దాంతో రైతులు మాట్లాడుతూ 1981లో మహవీర్ కంపెనీకి భూములు విక్రయించే సమయంలో కొంతమందికి మాత్రమే డబ్బు చెల్లించారని తెలిపారు. మిగతా వారికి ఇవ్వకుండా భూముల రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. భూముల రిజిస్ట్రేషన్ కంపెనీ పేరిట జరిగినప్పటికీ 40 ఏళ్లుగా తామే ఆ భూములను సాగుచేస్తున్నామని వివరించారు. జూట్‌మిల్లు కడతామని చెప్పి భూములు తీసుకున్న కంపెనీ మిల్లు పనులు చేపట్టలేదన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత భూములను తిరిగి రైతుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి అప్పగించాలని ఆర్డీవోకు వినతిపత్రాన్ని రైతులు అందజేశారు. విచారణలో ఆర్డీవోతో పాటు తహసీల్దార్ వరప్రసాద్, డీటీలు పాల్గొన్నారు.

రామతీర్థంలో జీయర్ స్వాములు



ఆలయంలో జీయర్ స్వాములు

నెల్లిమర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి దేవస్థానాన్ని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ సంపత్‌కుమార్ జీయర్ స్వామి, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ బృందావన జీయర్ స్వాములు గురువారం సందర్శించారు. సీతారామస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి వైదిక సిబ్బంది సాదరంగా ఆహ్వానించి, స్వామివారి సన్నిధిలో విశేష అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వండి

పాలకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీవర్షాల వల్ల అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో సంబంధిత రైతులకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తినాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. సాలూరు, కురపాం, పాలకొండ నియోజకవర్గాలతో పాటు భామిని తదితర మండలాలకు చెందిన రైతులు అరటితో పాటు చేతికి అందివచ్చిన మొక్కజొన్న, పత్తి తదితర పంటలను తీవ్రంగా నష్టపోయారన్నారు. భామిని మండలంల పంట భూములకు వరద ముంపు వల్ల నష్టం జరిగిందన్నారు. సమావేశంలో రైతు సంఘం నేతలు గురుబిల్లి అప్పలనాయుడు, మజ్జి సన్యాసి నాయుడు, పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీపై ర్యాలీ

పార్వతీపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణల్లో భాగంగా సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ప్రచార కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డి.డేవిడ్ అనిల్‌కుమార్ తెలిపారు. రవాణా శాఖ, వాణిజ్యపన్నుల శాఖ సంయుక్తంగా గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా రవాణాధికారి దుర్గా ప్రసాద్‌రెడ్డి, వినియోగదారుల అసోసియేషన్ అధ్యక్షుడు

ఘనంగా బాలికా దినోత్సవం

కొమరాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోటిపాం జిల్లా పరిషత్ హైస్కూల్, గురుకుల పాఠశాలలో గురువారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హక్కులు, చట్టాల కోసం బాలికలకు అవగాహన కల్పించారు. బాలికలకు విద్య ప్రాధానం, పౌష్టికాహారం కోసం వివరించారు కార్యక్రమంలో హెచ్‌ఎంలు, జిల్లా బాలల సంరక్షణ అధికారి సత్యనారాయణ, కౌన్సిలర్ తవిటిరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘ఉల్లాస్’ విజయవంతం చేయండి

మక్కువ రూరల్, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఎంపీడీవో కె.అర్జునరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు రెండు రోజుల శిక్షణ పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకు రావడం గొప్ప విషయన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న చైర్మన్

బొబ్బిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8, 15, 17 వార్డుల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు గురువారం భూమిపూజ చేశారు. 8వ వార్డు రత్నాలనగర్‌లో సీసీ రోడ్డు, డ్రైన్.. రాజుల సందులో పైపులైన్, 15వ వార్డు బొప్పడాపు వీధిలో సీసీ రోడ్డు, 17 వ వార్డు గౌడవీధిలో సీసీ డ్రైన్, 18వ వార్డులో సీసీ డ్రైన్ పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, డీఈఈ పెదిరెడ్ల కిరణ్ కుమార్, ఏఈలు ఏఎస్ కోటేశ్వరరావు, వీఎస్ఎన్ గుప్త, కౌన్సిలర్లు కింతలి శ్రీదేవి, బొత్స దమయంతి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

బొబ్బిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 18న జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్టు జిల్లా జేవీవీ ఉపాధ్యక్షుడు పోల సత్యంనాయుడు తెలిపారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటరులో గురువారం సాయంత్రం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని బలోపేతం చేసేందుకు ఏటా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఈ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతి నిధులు ఎస్‌వీ రమణమూర్తి, కె.కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యపోరాటాలకు సిద్ధంకండి

బొబ్బిలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు తమటాల అప్పలనాయుడు, రాయితి సత్యం పిలుపునిచ్చారు. స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చికాగో కార్మిక వర్గం స్మృతి వీరుల పోరాట స్ఫూర్తితో ఎంతోమంది కార్మికులు రక్తం చిందించి హక్కులను సాధించుకున్నారన్నారు. ఆ హక్కులను కాపాడుకునేందుకు పాలకవర్గంతో నిరంతం పోరాటాలు సాగుతూనే ఉన్నాయన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందన్నారు. 8 గంటల పనిదినాన్ని 13 గంటలకు పెంచారన్నారు. ఈ పనిదినాన్ని యథాతథంగా ఉంచాలని, లేబర్ కోడ్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీకెఎస్ నాయకులు దాసరి వెంకటరమణ, నల్లి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వీధుల్లో పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డు పర్యటనల్లో భాగంగా గురువారం ఆమె స్థానిక రైల్వే జంక్షన్ నుంచి గాంధీబొమ్మ సెంటర్, శ్వేతాచలపతి స్కూల్ రోడ్డు, వెలమవారి వీధి, రాజా కళాశాల మైదానం ప్రాంతంలో పర్యటించారు. మురుగునీటి కాలువలు, బహిరంగ స్థలాల్లో చెత్తాచెదారాలపై పారిశుధ్య సిబ్బందిని మందలించారు. వాటిని వెంటనే తొలగించి శుభ్రం చేయాలనిఆదేశించారు. మార్కెట్ రోడ్డులో షాపుల వద్ద వ్యర్థాలను కుప్పలుగా పోయకుండా నేరుగా నైట్ శానిటేషన్ వాహనాలకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్లకు సూచనలిచ్చారు. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ అవార్డును ఇటీవల దక్కించుకున్న బొబ్బిలి మున్సిపాలిటీలో పారిశుధ్య నిర్వహణ విషయంలో ఎవరూ వేలెత్తి చూపని రీతిలో చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. పర్యటనలో శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళి, పర్యావరణ ఇంజనీర్ సోమేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రేపు బాలబాలికలకు స్పోర్ట్స్ మీట్

బొబ్బిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరబొబ్బిలి క్రీడా మైదానంలో శనివారం బాలబాలికల కోసం స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్టు స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రావు శ్రీనివాసరావు, సిరిపురపు ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 8, 9 సంవత్సరాల వయస్సు కలిగిన బాలబాలికల కోసం అదే రోజు ఉదయం 7 గంటలకు 50, 100, 400 మీటర్ల పరుగు పందేలు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులను అందజేస్తామని వారు తెలిపారు.

18 మందితో జాయింట్ యాక్షన్ కమిటీ



గిరడను సత్కరిస్తున్న ప్రతినిధులు

బొబ్బిలి, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తూర్పు కాపు సమాజ అభ్యున్నతికి కోసం జిల్లా వ్యాప్తంగా 18 మంది కాపు కుల పెద్దలతో కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్టు తూర్పు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ గిరడ అప్పలస్వామి తెలిపారు. స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన జాయింట్ యాక్షన్ కమిటీని నియమించారు. కమిటీ గౌరవ చైర్మన్‌గా రౌతు రామ్మూర్తి, సహాయ చైర్మన్‌గా కురుపాంనకు చెందిన తోడెల శ్రీరామ్, వైస్ చైర్మన్లుగా బొబ్బిలి ఏఎంసీ డైరెక్టర్ లంక రమేష్, పైల హరిప్రసాద్, అల్లాడ భాస్కరరావు, తాడికొండ రమేష్‌తో పాటు మరి కొంతమందిని నియమించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తామంతా సమష్టిగా కాపుకుల అభ్యున్నతి కోసం పని చేస్తామన్నారు. అందరి సమన్వయంతో ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళతామన్నారు. తొలుత రాష్ట్ర స్థాయి జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన అప్పలస్వామిని ఏఎంసీ డైరెక్టర్ లంక రమేష్, 19వ వార్డు జనసేన ఇన్‌చార్జి కొట్టేడ సురేష్ తదితరులు సత్కరించారు.

ఆహారాన్ని వృథా చేయవద్దు

బొబ్బిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆహారాన్ని వృథా చేయవద్దని కారుణ్య ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేసీ రాజు, సీహెచ్.జె.ప్రవీణ్‌కుమార్ కోరారు. ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహార భద్రత-వృథా అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాజు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 30 శాతం ఆహారం వృథా అవుతోందని పలు సర్వేల ద్వారా వెల్లడైందన్నారు. ఇది అవాంఛనీయమైన అంశమన్నారు. ఎంతో మంది పేదలు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. వారి ఆకలిని తీర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. హోటళ్లు, ఫంక్షన్లలో ఆహారాన్ని వృథాగా పారబోయడం అన్యాయమన్నారు. ఆహార వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో వ్యవహరించాలన్నారు. అన్ని వర్గాలలో ఆహారం విలువను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చొక్కాపువానివలసలో ఏనుగులు



సంచరిస్తున్న ఏనుగులు

పార్వతీపురం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చొక్కాపువానివలస ప్రాంతంలో గురువారం ఏనుగులు సంచరించాయి. కొన్ని రోజులుగా మండలంలో ఏనుగుల సంచారం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంటల తో పాటు వ్యవసాయ మోటార్లను ధ్వంసం చేస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు.